సాక్షి ప్రకాశం

శనివారం । 9 । ఆగస్టు । 2025



వసతి అధోగతి

కనిగిరి నియోజకవర్గంలోని బాలికల సంక్షేమ వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయి. మెనూ పాటించకపోవడంతో విద్యార్థినులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. - 8లో..



నిరుపేద కుటుంబాల్లో విషాదం


పెద్దదోర్నాల మండల పరిధిలోని చిన్నగుడిపాడు చెరువులో శుక్రవారం ఇద్దరు బాలురు నీట మునిగి మృత్యువాత పడటం జమ్మిదోర్నాల గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. - 8లో..

గరిష్టం/కనిష్టం

36 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.



కొత్తపట్నం రోడ్డులో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో వరలక్ష్మీదేవి అలంకారం



గాంధీరోడ్డులో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో పూజల్లో పాల్గొన్న చిన్నారులు, మహిళలు



కంభం చెరువు కట్టపై తేరాతేజీ ఉత్సవంలో పాల్గొన్న ముస్లింలు

ఆధ్యాత్మిక పరిమళం

శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా జిల్లాలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సౌభాగ్యాన్ని, సిరిసంపదలను ప్రసాదించే వరలక్ష్మీ అమ్మవారిని ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చుకున్నారు. మరోవైపు చారిత్రక కంభం చెరువు కట్టపై తేరాతేజి (గరికతొక్కుడు) పండుగను ముస్లింలు వైభవంగా జరుపుకున్నారు. నూతన వధూవరులు కంభం చెరువులో పెళ్లినాటి దండలు వదిలి తమ మొక్కులు తీర్చుకున్నారు. కట్టపై ఉన్న దీనాషావలి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఒంగోలు నగరంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు

అనురాగ బంధనం

శనివారం రక్షాబంధన్ పండుగ సందర్భంగా రాఖీలు కొనుగోలు చేసేందుకు మహిళలు, యువతులు ఆసక్తి చూపారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో రాఖీలు విక్రయించే దుకాణాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. రాఖీలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో దుకాణాలు కళకళలాడాయి.

న్యూస్‌రీల్

పూరీ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం

- రైల్వే స్టేషన్లో పోలీసుల తనిఖీలు



రైల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టడంలో భాగంగా పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగల్ టీమ్, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సంయుక్తంగా ఒంగోలు రైల్వే స్టేషన్లో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్ తో కలిసి రైల్వేస్టేషన్ పరిసరాలు, అనుమానస్పద పార్శిళ్లు, ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. పూరి ఎక్స్‌ప్రెస్‌లో మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు నిమిత్తం జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలను రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకొంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు ఆంజనేయులు, శ్రీకాంత్, మధుసూదన్ రావు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులతో చంద్రబాబు డబుల్ గేమ్

- ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సాలార్



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సాలార్

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర హజ్ యాత్ర చేసే ముస్లింలతో చంద్రబాబు ప్రభుత్వం డబుల్ గేమ్ ఆడుతోందని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సాలార్ విమర్శించారు. శుక్రవారం ఆయన ఇస్లాంపేటలో విలేకరులతో మాట్లాడుతూ... గన్నవరం నుంచి మక్కా యాత్రకు వెళ్లిన వారికి మాత్రమే సబ్సిడీ ఇచ్చి హైదరాబాద్, బెంగళూరు నుంచి మక్కా యాత్రకు వెళ్లి వచ్చిన ఆంధ్రప్రదేశ్ హజ్ యాత్రికులకు మొండిచేయి చూపడం చంద్రబాబు ద్వంద్వ వైఖరికి నిదర్శమన్నారు. 2025వ సంవత్సరంలో గన్నవరం నుంచి దరఖాస్తు చేసుకొని హజ్ యాత్ర చేసి వచ్చిన 72 మందికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల సబ్సిడీ ఇచ్చి మొత్తం ముస్లిం సమాజానికి ఏదో పెద్ద మేలు చేసినట్లు ఫోజులు కొడుతోందని ధ్వజమెత్తారు. నిజానికి ఈ ఏడాది రాష్టానికి చెందిన హజ్ యాత్రికులు హైదరాబాద్, బెంగళూరు నుంచి కూడా మక్కాకు వెళ్లి వచ్చారని తెలిపారు. వారికి మాత్రం ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ ఇవ్వలేదన్నారు. గన్నవరం ఎంబార్‌కేషన్ పాయింట్ నుంచి యాత్రికులు దరఖాస్తు చేసుకోవాలంటే ఇతర ప్రాంతాల నుంచి దరఖాస్తు చేసుకునే వారి కంటే ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారని చెప్పారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హజ్ యాత్రికులకు తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి రూ.60 వేలు, ఇతరులకు రూ.30 వేలు సబ్సిడీ ఇవ్వడమే కాకుండా గన్నవరం ఎంబార్‌కేషన్ పాయింట్ నుంచి వెళ్లే యాత్రికుల నుంచి వసూలు చేసే అదనపు సొమ్మును కూడా తిరిగి చెల్లించిందని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగానే గన్నవరం ఎంబార్‌కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్ర చేసే ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న అదనపు సొమ్మును తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే హజ్ యాత్రికుల ప్రయాణ చార్జీల మధ్య వ్యత్యాసాన్ని సరి చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. సమావేశంలో ఇన్సాఫ్ నాయకులు షేక్ ఇమ్రాన్, షేక్ ఆసిఫ్, షేక్ ఫయాజ్ పాల్గొన్నారు.

రక్షణ కరువు.. వసతి బరువు!

ఒంగోలు గిరిజన సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థుల మధ్య కొట్లాట.. చీమకుర్తి బాలికల వసతి గృహంలో బాలిక జడ కత్తిరింపు.. సింగరాయకొండ బాలుర వసతి గృహంలో మంటల్లో పడి విద్యార్థికి గాయాలు.. ఇలా జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో నిత్యం ఏదో ఒక ఘటన జరుగుతూనే ఉన్నాయి. పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన వసతి గృహాలపై ఉన్నతాధికారుల దగ్గర నుంచి వార్డన్ వరకూ పర్యవేక్షణ కరువైంది. చాలా హాస్టళ్లు ఇన్‌చార్జుల పాలనలో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. 175 హాస్టళ్లు ఉండగా అందులో 52 హాస్టళ్లకు ఇన్‌చార్జిలే దిక్కు. సంక్షేమశాఖ మంత్రి డోలబాల వీరాంజనేయస్వామి సొంత జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు సంక్షోభ నిలయాలుగా మారాయి.

- ప్రమాదం అంచున వసతి గృహ విద్యార్థులు
- ఇన్‌చార్జి వార్డెన్లతో విద్యార్థులకు రక్షణ కరువు
- 52 వసతి గృహాలకు ఇన్‌చార్జిలే దిక్కు..
- పర్యవేక్షణ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు, వివాదాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- సంక్షేమశాఖ మంత్రి సొంత జిల్లాలో అస్తవ్యస్తంగా వసతి గృహాలు

ఒంగోలు వన్‌టౌన్:

కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ వసతి గృహాలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. పేద విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ కల్పించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన హాస్టళ్లలో కనీస రక్షణ కరువైంది. చాలా హాస్టళ్లకు ఇన్‌చార్జిలే ఉండడంతో విద్యార్థుల బాగోగులు పట్టించుకునే వారే కరువయ్యారు. సాక్షాత్తూ సంక్షేమశాఖ మంత్రి డోలబాల వీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గం సింగరాయకొండ బాలుర వసతి గృహం అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థి అగ్ని ప్రమాదానికి గురయ్యాడు. జిల్లాలో ఇటీవల పలు హాస్టళ్లలో చోటుచేసుకున్న ఘటనలు ఒక్కసారి పరిశీలిస్తే అక్కడ నెలకొన్న పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అవగతమవుతుంది. చాలా మంది వార్డన్లు హాస్టళ్లకు విజిటింగ్ ప్రొఫెసర్లుగా వచ్చి పోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కిందిస్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగించేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 175 వసతి గృహాల్లో 17,250 మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారు. ఇందులో 24 ఎస్సీ, 18 బీసీ, 10 ఎస్టీ వసతి గృహాలు ఇన్‌చార్జిల పాలనలో నడుస్తున్నాయి.



మంటల్లో పడి చికిత్స పొందుతున్న సింగరాయకొండ విద్యార్థి (ఫైల్)



చీమకుర్తి వసతి గృహంలో కత్తిరించిన బాలిక జుట్టు (ఫైల్)



పాముకాటుకు గురైన గిద్దలూరు విద్యార్థి (ఫైల్)

మంటల్లో విద్యార్థికి గాయాలు

జూలై 25వ తేదీన సింగరాయకొండ బాలుర వసతి గృహం ఆవరణలో విద్యార్థి మంటల్లో పడి గాయపడ్డాడు. రాత్రి భోజనం చేసిన తర్వాత ముగ్గురు విద్యార్థులు వసతి గృహంలోని ఇసుక కుప్పల వద్దకు వెళ్లారు. హాస్టళ్లలో జరుగుతున్న పనుల కోసం ఉంచిన టర్పెన్‌టైన్ ఆయిల్ బాటిల్‌ను కింద వేసి వెలిగించాడు. ఆ తరువాత ఆ మంటలను చూద్దామని అక్కడికి వేగంగా వచ్చిన మరో విద్యార్థి ప్రమాదవశాత్తూ రాయి తట్టుకుని మంటలపై పడి గాయపడ్డాడు. బాలుడిని తోటి విద్యార్థులు ప్రథమ చికిత్స నిమిత్తం సమీపంలోని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. హాస్టల్‌కు రెగ్యులర్ వార్డన్ లేరు. ఒంగోలు అంజయ్య రోడ్డులోని కళాశాల వసతి గృహం వార్డన్ ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జి వార్డన్ 35 కిలో మీటర్లు ప్రయాణం చేసి ఇక్కడకు వస్తున్నారు. దీంతో ఈ వసతి గృహ అధికారి ఎక్కడా న్యాయం చేయలేక, సింగరాయకొండకు, ఒంగోలుకు ప్రయాణం చేయడంతోనే సమయం గడుస్తోంది.

గిరిజన హాస్టల్‌లో డిష్యుం..డిష్యుం..



ఒంగోలు గిరిజన సంక్షేమ వసతి గృహంలో ఈ నెల 2వ తేదీన కొందరు విద్యార్థులు తన్నుకున్నారు. సీనియర్, జూనియర్ విద్యార్థులతో పాటు బయట నుంచి వచ్చిన వారి మధ్య వివాదం జరిగి కొట్టుకోవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. వారిని పక్కనే ఉన్న జీజీహెచ్‌కు తరలించారు. చదువు పూర్తయిన నలుగురు విద్యార్థులు, ఇంటర్న్ షిప్ పేరుతో హాస్టల్‌లో ఉంటున్నారు. అలాగే ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థి అనధికారికంగా ఉంటున్నారు. వీరు రెగ్యులర్‌గా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులతో గొడవపడ్డారు. అనధికారికంగా ఉంటున్న విద్యార్థులకు తోడుగా బయట నుంచి కొంత మంది వచ్చి హాస్టల్ విద్యార్థులను చితకబాదారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇక్కడ అనధికారికంగా విద్యార్థులు ఉంటుంటే హాస్టల్ వార్డన్ ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక్కడ కూడా రెగ్యులర్ వార్డన్ లేరు. చీమకుర్తి గురుకులు పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆయన అప్పుడప్పుడూ వచ్చి వెళుతుంటారని తెలిసింది.

విద్యార్థి జడ కత్తిరింపు కలకలం...

చీమకుర్తి బాలికల వసతి గృహంలో ఈ నెల 2వ తేదీన ఓ విద్యార్థిని జడ కత్తిరింపు కలకలం రేపింది. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక శుక్రవారం రాత్రి నిద్రపోయింది. శనివారం ఉదయం నిద్రలేవగానే జడ కత్తిరించి ఉండడంతో విస్తుపోయింది. వెంటనే ఈ విషయాన్ని సహచర విద్యార్థినులతో పాటు వార్డన్‌కు సమాచారం అందించింది. జిల్లాలో సంచలనంగా మారిన ఈ ఘటన సంక్షేమ హాస్టళ్లలో బాలికలకు భద్రత కరువైందన్న దానికి రుజువుగా నిలుస్తోంది. దాదాపు 180 మంది విద్యార్థినులు ఐదు గదుల్లోనే సర్దుకుంటున్నారు. ఇంత మంది బాలికలు ఉన్న హాస్టల్ వార్డన్ ఒంగోలులో ఉండి రోజూ గంటపాటు వచ్చి పోతుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి ఇంత వరకూ దోషులను తేల్చకపోవడం గమనార్హం. ఆడపిల్లలకు ఇక్కడ రక్షణ కరువైందని బాలికల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటన జరిగిందని తెలుసుకున్న మాజీ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున హాస్టల్‌ను సందర్శించి బాలికలకు ధైర్యం చెప్పి వచ్చారు. అలాగే హాస్టల్‌లో బాలికలకు భద్రత కల్పించే విషయంలో ఉన్నతాధికారులు దృష్టిసారించాలని డిమాండ్ చేశారు.

పాముకాటు..చికిత్సకు 150 కిలోమీటర్లు

గిద్దలూరు సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో జూలై 23వ తేదీన ఓ విద్యార్థిని పాముకాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని వెంటనే గిద్దలూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మార్కాపురం తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. దాదాపు 150 కిలోమీటర్లు ప్రయాణిస్తేగాని విద్యార్థి ప్రాణం దక్కలేదు. స్థానికంగా ఉండే ఆస్పత్రులో అత్యవసర సేవలు సరిగా అందడంలేదనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

కనీసం వాచ్‌మన్ ఉన్నా సంఘటనను అడ్డుకునే ప్రయత్నం జరిగేది. ఆయనా అందుబాటులో లేడు. మొత్తంగా ఇన్‌చార్జి వార్డన్ల పాలనలో హాస్టల్ విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రం ఉన్నతాధికారులు వచ్చి హడావుడిచేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వసతి గృహాల్లో విద్యార్థుల పరిస్థితి దారుణంగా మారుతోంది.

ఓట్లు తీసేసేలా కేంద్ర ప్రభుత్వం కుట్ర



ప్రకాశం భవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

ఒంగోలు టౌన్: బీహార్‌లో దొడ్డిదారి విజయం కోసం దేశ పౌరులను ఓటు హక్కు లేకుండా చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిరసిస్తూ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవనం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఎం జిల్లా నాయకులు చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ మరో రెండు నెలల్లో బీహార్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎలాగైనా సరే అధికారం చేపట్టాలని బీజేపీ కుయుక్తులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఓటర్ లిస్టులో డబుల్ ఎంట్రీలు, విదేశీ ఓటర్లు ఉన్నారనే నెపంతో ఎస్ఆర్ఐ ప్రక్రియ ద్వారా 64 లక్షల ఓట్లను తొలగించిందని చెప్పారు. ఓటు హక్కు కోసం పౌరసత్వం కోసం నిర్దేశించిన డాక్యుమెంట్లను ప్రమాణికంగా పేర్కొనడం దొడ్డిదారిన ఆర్ఎస్ఎస్ రహస్య ఎజెండాను అమలు చేయడమేనని ధ్వజమెత్తారు. చట్టాల పేరుతో ప్రజల మధ్య విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఎం న్యూ డెమొక్రసి జిల్లా కార్యదర్శి సీహెచ్ సాగర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారాన్ని అడ్డం పెట్టుకున్న బీజేపీ దేశంలోని ప్రతిపక్ష పార్టీల ఓట్లను తొలగించడం ద్వారా ఓటర్ల హక్కులు, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ బీహార్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల సవరణ చేపట్టడం వెనక పెద్ద కుట్ర దాగుందని విమర్శించారు. బీజేపీ విజయం కోసం ఓట్ల తారుమారుకు పాల్పడుతోందని మండిపడ్డారు. దేశ ప్రజలంతా ఓటర్ల సవరణను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో పి.కల్పన, ఉబ్బా ఆదిలక్ష్మి, జయంతిబాబు, ఎం.రమేష్, పెంచాల హనుమంతరావు, బాలకోటయ్య, టి.రాము, మస్తాన్, దామా శ్రీనివాసరావు, సిహెచ్ లక్ష్మి నారాయణ, బంకా సుబ్బారావు పాల్గొన్నారు.

మంగమూరు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

- హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన నీటి సంఘ అధ్యక్షుడు

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామ పంచాయతీకి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ అదే గ్రామానికికి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు అబ్బూరి శ్రీను హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం కేసు నంబర్ 30684ను కేటాయించింది. గతంలో మంగమూరు గ్రామ పంచాయతీ ని ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయగా పురపాలక ఎన్నికల నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో మంగమూరును గ్రామ పంచాయతీగానే కొనసాగించి, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో గత 13 ఏళ్ల నుంచి హైకోర్టులో మంగమూరు గ్రామ పంచాయతీ ఎన్నికల వివాదం కొనసాగింది. ఈ ఏడాది జూన్‌లో కోర్టు కేసులు ముగిశాయి. జిల్లాలో కొండపి పంచాయతీతోపాటు మంగమూరుకు కూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఎన్నికల నిర్వహణ అధికారులు కొండపికి మాత్రమే నోటిఫికేషన్ వెలువరించారు. ఈ నేపథ్యంలో మంగమూరు పంచాయతీకి కూడా వెంటనే ఎన్నికలు నిర్వహించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరుతూ అబ్బూరి శ్రీను మరోమారు హైకోర్టును ఆశ్రయించారు.

పడిపోతున్న పొగాకు కనిష్ట ధరలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో కనిష్ట ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర కేజీ రూ.150 పలికింది. శుక్రవారం నిర్వహించిన వేలంలో ఒక్క రోజులోని పది రూపాయలు తగ్గి రూ.140 కు పడిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలం ప్రారంభం సమయంలో కనిష్ట ధర కేజీ రూ.260 ఉండగా తొమ్మిదో రౌండ్ మధ్యలోకి వచ్చేసరికి ప్రారంభ ధరతో పోలిస్తే దాదాపు రూ.120 పడిపోవడంతో రైతులు ఏం చేయాలని దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. గత సంవత్సరం వేలంలో వేలం ప్రారంభించిన తర్వాత ధరలు పెరుగుతూ పోతే ఈ సంవత్సరం వేలం ప్రారంభించిన తర్వాత ధరలు తగ్గుతూ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక సంఖ్యలో బేళ్ల తిరస్కరణ ఒకవైపు, గిట్టుబాటు ధర లేక మరొక వైపు రైతులు తీవ్ర ఇబ్బంది పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని పొగాకు రైతులు కోరుతున్నారు.

పొగాకు కనిష్ట ధర కేజీ రూ.140

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్టధర కేజీ రూ.140 పలికిందని ఇన్చార్జి వేలం నిర్వహణ అధికారి ఎం.సత్య శ్రీనివాస్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కామేపల్లి పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1022 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 842 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 180 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.282, కనిష్ట ధర కేజీ రూ.140, సరాసరి ధర కేజీ రూ.228.68 గా నమోదైంది. వేలంలో 25 కంపెనీలు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రంలో రోజురోజుకీ కనిష్ట ధరలు పడిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే 39 మంది కంపెనీ ప్రతినిధులు ఉంటున్నారు. కేవలం పట్టుమని 10 కంపెనీలే పొగాకు కొనుగోలు చేస్తున్నాయి. మిగిలిన కంపెనీ ప్రతినిధులు ఒకటో అరో బేళ్లు కొనుగోలు చేసి సరిపెట్టుకుంటున్నారు. పొగాకు బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని, వేలంలో అన్నీ కంపెనీలు పాల్గొనటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో శుక్రవారం కనిష్ట ధర రూ.150కి పడిపోయింది. వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకి చెందిన రైతులు వేలానికి 832 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 628 కొనుగోలు చేయగా, 204 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.281 కాగా, కనిష్ట ధర రూ.150 పలకగా, సరాసరి రూ.220.49 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 39 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు

వసతి.. అధోగతి!


కనిగిరిలోని బాలికల సమీకృత వసతి గృహం

పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన బాలికల సంక్షేమాన్ని కూటమి సర్కారు గాలికొదిలేసింది. కనిగిరి నియోజకవర్గంలోని సంక్షేమ వసతి గృహాల్లో దయనీయ పరిస్థితులు బాలికల విద్యాభ్యాసంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పాటు మెనూ సక్రమంగా అమలు చేయని కారణంగా బాలికలు చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నారు. ఈ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న బాలికల్లో 80 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారే కావడం గమనార్హం. వీరి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పడం మినహా సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలు శూన్యం.

కనిగిరి నియోజకవర్గంలో బాలికల హాస్టళ్లలో సమస్యల మోత

- మెనూకు మంగళం పాడటంతో అర్ధాకలితో అలమటిస్తున్న పిల్లలు
- శానిటరీ ప్యాడ్స్ ఇవ్వకపోవడంతో లోలోన కుమిలిపోతున్న వైనం
- సమస్యల మధ్య సవ్యంగా సాగని బాలికల విద్య
- ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా మారని తీరు
- ఉన్నతాధికారుల తనిఖీలు శూన్యం.. కూటమి నేతల ప్రచారం ఘనం

కనిగిరి రూరల్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వసతి గృహాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయనేందుకు కనిగిరి నియోజకవర్గంలో సంఘటనలే నిదర్శనం. హాస్టళ్ల తనిఖీకి వచ్చిన ప్రజాప్రతినిధులు, కొందరు అధికారుల ఎదుట విద్యార్థులు గోడు వెళ్లబోసుకున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 24న కనిగిరి మోడల్ స్కూల్ బాలికలు భోజనం నాణ్యంగా లేదని, మెనూ పాటించడం లేదని డీఈఓ, డీవైఈఓకు ఫిర్యాదు చేశారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ సైతం కలెక్టర్‌కు, ఆ శాఖ ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేశారు. మార్చి 8వ తేదీన కనిగిరి బీసీ గురుకుల బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన మంత్రి సవిత ఎదుట విద్యార్థినులు తమ సమస్యలు ఏకరువు పెట్టారు. ×దొడ్డు బియ్యం తిన లేక పోతున్నాం. మెనూ సరిగా లేదే×ని మంత్రికి ఫిర్యాదు చేయగా సన్నబియ్యంతో భోజనం పెడతామని చెప్పి వెళ్లారు. కానీ ఇప్పటి వరకు ఆయా హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించలేదు. ఈనెల 3వ తేదీన ఆదివారం రాత్రి కనిగిరి సమీకృత బాలికల వసతి గృహాన్ని వెలిగండ్ల ఎస్సై కృష్ణ పావని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల, పాఠశాల విద్యార్థినులు చాలా మంది అన్నం తినకుండా అర్ధాకలితో ఉన్నట్లు తెలిసింది. ఈనెల 4న సోమవారం అదే సమీకృత హాస్టల్‌ను ఎమ్మెల్యే ఉగ్ర తనిఖీ చేయగా వసతులు కల్పించాలని, మెనూ సక్రమంగా లేదని ఫిర్యాదు చేయడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సోషల్ మీడియా వేదికగా బహిర్గతమైంది. ఈ నెల 6వ తేదీన మున్సిపల్ చైర్మన్ గఫార్ బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేయగా అక్కడి విద్యార్థినులు తమకు ఇప్పటి వరకు శానిటరీ ప్యాడ్స్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలన్నీ హాస్టళ్ల నిర్వహణ తీరు, బాలికల సంక్షేమంపై సర్కారు నిర్లక్ష్య వైఖరిని తేటతెల్లం చేస్తున్నాయి.


ఎస్సై కృష్ణపావనికి సమస్యలు చెబుతున్న సమీకృత బాలికల హాస్టల్ విద్యార్థినులు(ఫైల్)


డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న కనిగిరి మోడల్ స్కూల్ విద్యార్థినులు(ఫైల్)


బీసీ బాలికల హాస్టల్లో విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్(ఫైల్)


మంత్రి సవిత ఎదుట దొడ్డు బియ్యంతో అన్నం పెడుతున్నారని చెబుతున్న బాలికలు(ఫైల్)

తనిఖీలతోనే సమస్యలు కొలిక్కి!

బాలికల హాస్టళ్లలో వెల్ఫేర్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మెనూ పాటించకపోయినా, ఎలా వండినా తప్పనిసరిగా అదే తినాల్సిన పరిస్థితి హాస్టళ్లలో నెలకొంది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు, ఐసీడీఎస్, మహిళా సమాఖ్య సంఘాలు, మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా అధికారులు, సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు తరచూ హాస్టళ్లను తనిఖీ చేస్తే బాలికల సమస్యలు వెలుగులోకి వచ్చి కొంత మేరయినా పరిష్కారయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టు కూడా హాస్టళ్లను అధికారులు తనిఖీ చేసిన నివేదికలు తమ ముందు ఉంచాలని ఆదేశించిన నేపథ్యంలో ఇప్పటికైనా పాలకులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

నిరుపేద కుటుంబాల్లో విషాదం

- ఇద్దరు చిన్నారుల ఉసురు తీసిన ఈత సరదా
- మట్టి అక్రమ రవాణాకు తీసిన గుంతలే కారణమని బంధువుల ఆగ్రహం


మృతదేహాలను బయటకు తీసుకొస్తున్న స్థానికులు


మృత్యువాత పడిన ఇద్దరు విద్యార్థులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నగుడిపాడు చెరువులో శుక్రవారం ఇరువురు బాలురు నీట మునిగి మృత్యువాత పడ్డారన్న సమాచారం జమ్మిదోర్నాల గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మృత్యువాతపడ్డ పులుకూరి పవన్‌కుమార్(14) తండ్రి పులుకూరి గాలెయ్య ఏడేళ్ల క్రితమే మృతి చెందగా, చూపు సరిగా లేని తల్లి పులుకూరి రాకాటి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టల్లో ఉండి చదువుకుంటున్న కుమారుడు సెలవులకు ఇంటి వచ్చి మృత్యువాతపడటంతో తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది. అదే కాలనీలోనే నివాసం ఉంటున్న పులుకూరి అద్భుత కుమార్(16) తండ్రి పెద్దపోలయ్య నంద్యాల జిల్లా శ్రీశైలం పుణ్యక్షేత్రంలో హమాలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. హమాలీ పనిపై వచ్చే సంపాదనతోనే ముగ్గురు పిల్లలను చదివించుకుంటున్నాడు. పెద్ద కుమారుడు నీట మునిగి చనిపోవడంతో పెద్దపోలయ్య, మేరీరాణి దంపతులు హృదయ విదారకంగా రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మృత్యువాతపడటంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా మట్టిని అక్రమంగా తరలించడం కోసం చెరువులో ఇష్టారీతిగా గుంతలు తీసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని మృతి చెందిన చిన్నారుల బంధువులు డిమాండ్ చేశారు.


కుమారుల మృతితో రోదిస్తున్న తల్లిదండ్రులు

రౌడీషీటర్ అరెస్టు

సింగరాయకొండ: వివిధ కేసుల్లో కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న రౌడీషీటర్ తన్నీరు శివ మహేష్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు. కోర్టు వాయిదాలకు హాజరుకాకపోతే వారెంట్‌పై అరెస్టు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

అనుబంధాల సంబరం

- తేరాతేజీ సందర్భంగా భక్తులతో పోటెత్తిన కంభం చెరువు కట్ట
- పెళ్లినాటి దండలు నీటిలో వదిలిన నూతన వధూవరులు
- దీనాషావలి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

భక్తులతో కళకళలాడుతున్న కంభం చెరువు కట్ట


కంభం: తేరాతేజీ(గరికతొక్కుడు) పండగ సందర్భంగా శుక్రవారం చారిత్రాత్మక కంభం చెరువుకట్టపై కోలాహలం నెలకొంది. కంభం చుట్టుపక్కల గ్రామాలతోపాటు కాక ఇతర జిల్లాల నుంచి ముస్లింలు కుటుంబ సమేతంగా చెరువు కట్టపైకి చేరుకున్నారు. నూతన వధూవరులు పెళ్లినాటి దండలను చెరువు నీటిలో వదిలి మొక్కులు చెల్లించారు. పిల్లలు, నూతన జంటలు తమ కుటుంబ సభ్యులతో సెల్ఫీలు దిగుతూ, తూముల నుంచి ప్రవహిస్తున్న నీటిలో జలకాలాడుతూ సందడి చేశారు. కట్టపై ఉన్న దీనాషావలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాపై చాదర్లు కప్పి మొక్కులు చెల్లించారు. ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహార పదార్థాలను కుటుంబ సమేతంగా ఆరగించి సేద తీరారు. చెరువు కట్ట వద్ద భక్తులకు కూలింగ్ వాటర్, మజ్జిగ పంపిణీ చేసి పలువురు యువకులు దాతృత్వాన్ని చాటుకున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కంభం సీఐ కె.మల్లికార్జున ఆధ్వర్యంలో కంభం, అర్ధవీడు ఎస్సైలు నరసింహారావు, సుదర్శన్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


చెరువుకట్టపై దీనాషావలి దర్గా వద్ద భక్తుల రద్దీ


దర్గాపై చాదర్ కప్పుతున్న భక్తులు


భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేస్తున్న యువత


తూము నీటి ప్రవాహం వద్ద కోలాహలం


పెళ్లి నాటి దండలు నీటిలో వదులుతున్న కొత్త జంటలు

టీడీపీ నేతల కక్ష సాధింపు

- వైఎస్సార్ సీపీ నాయకుడి స్థలంలో కంచె తొలగింపు
- పొదిలి మండలం కుంచేపల్లిలో ఘటన

పొదిలి రూరల్: అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు బరితెగిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సైతం ఏదో రకంగా సమస్యలు సృష్టించి వైఎస్సార్ సీపీ శ్రేణులపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. అన్యాయాన్ని ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయించి వేధించేందుకు పావులు కదుపుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పొదిలి మండలంలోని కుంచేపల్లి గ్రామంలో పేరం వీరా బ్రహ్మారెడ్డి 50 ఏళ్ల క్రితం పూర్వీకుల నుంచి సంక్రమించిన గ్రామ కంఠం భూమిలో ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. ఆయన కుమారుడు నాగిరెడ్డి గ్రామంలోని మరోచోట ఇల్లు నిర్మించగా ప్రస్తుతం అందులో ఉంటున్నారు. పాత ఇంటి స్థలం ఖాళీగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు నాగిరెడ్డికి చెందిన ఖాళీ స్థలంపై కన్నేశారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం గురువారం జనం లేని సమయంలో అధికారులతో వచ్చి స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన కంచె, రాళ్లు పీకేశారు. ఆ సమయంలో ఎవరైనా వచ్చి గొడవ చేస్తే కేసులు బనాయించాలని పథకం రచించారు. ఎవరూ లేనపుడు వచ్చి హడావుడి చేసి కంచె, రాళ్లు తొలగించారని, ఆ స్థలం తమ పూర్వీకుల నుంచి సంక్రమించినదని నాగిరెడ్డి తెలిపారు.


నాగిరెడ్డి స్థలంలో పీకేసిన కంచె


తొలగించి గుట్టగా వేసిన రాళ్లు

యువ ఆంధ్ర ప్రో కబడ్డీ అంపైర్‌గా శ్రావణి



వేటపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న జరుబుల శ్రావణి యువ ఆంధ్ర కబడ్డీ సీజన్-1 కి రిఫరీగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్ర కబడ్డీ రిఫరీస్ బోర్డ్ నుంచి ఎంపికైనట్లు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీలో 30 నేషనల్స్ ఆడి జిల్లా కీర్తి ప్రతిష్టలను శ్రావణి నిలబెట్టారన్నారు. ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్‌కి ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వేటపాలెం విద్యార్థులు

వేటపాలెం: రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని శుక్రవారం తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా గురువారం బాపట్లలో రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు సెలక్షన్స్ జరిగాయి. ఈ సెలక్షన్స్‌లో హైస్కూల్ చదువుతున్న కె.గాయత్రి, పి.బిందు వాలీబాల్ పోటీలకు, షేక్ నస్రీన్, ఎల్.వైష్ణవి కబడ్డీకి ఎంపికయ్యారని తెలిపారు. గుంటూరులో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారన్నారు.

వల్లూరమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.23.47 లక్షలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన వల్లూరు గ్రామంలోని వేంచేసియున్న వల్లూరమ్మ ఆలయంలో హుండీ కానుకలను శుక్రవారం దేవదాయ శాఖ పరిశీలకుడు వేణుగోపాలరావు ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం 133 రోజులకుగాను 10 హుండీల్లో పోగైన కానుకలు లెక్కించగా రూ.23,47,024 నగదు, 141 అమెరికన్ డాలర్లు ఆదాయంగా సమకూరాయని ఆలయ ఈవో బి.రమేష్ పేర్కొన్నారు. లెక్కింపులో ఆలయ అర్చకులు, సేవా సంఘం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది